ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టులో ఏముంది?

- సిఎం రేవంత్ ఆరా
- మరోసారి మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల ప్రత్యక్ష పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) ఇచ్చిన మధ్యంతర నివేదికపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఆ నివేదికలో ఎలాంటి ఏమేం సిఫారసులున్నాయి ? ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపైనా మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించారు. శనివారం సాయంత్రం సచివాలయంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఆయన చర్చలు జరిపారు. అలాగే మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు ఈసమావేశంలో పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు కుంగిపోవటంతో తాత్కాలికంగా చేపట్టాల్సిన మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలపై ఇటీవల ఎన్డీఎస్‌ఎ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఈ నివేదికలో ఉన్న ముఖ్యమైన అంశాలు, సిఫారసులన్నింటినీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిఎం రేవంత్‌తోపాటు మంత్రులకు వివరించారు. 2019లోనే బ్యారేజీలకు ప్రమాదం ఉన్నట్టు ఎన్డీఎస్‌ఎ నివేదిక తేల్చిందనీ, రిపేర్లు, పునరుద్ధరణ చర్యలు చేపట్టినా ప్రాజెక్టుకు ముప్పు ఉండదని చెప్పలేదని ఎన్‌డిఎస్‌ఎ ఆ నివేదికలో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్నందున ఈలోగానే తీసుకోవాల్సిన చర్యలపైనా రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని సిఎం అన్నారు. మరమ్మతులు చేయాలా? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? మరింత నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలనేది సాగునీటిపారుదల, ఆయకట్టు శాఖ అధికారులతో కలిసి నిర్ణయాలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. నిజానికి శనివారం రాష్ట్ర క్యాబినెట్ భేటీ జరగకపోవడంతో ఈ కీలకమైన అంశాలపై చర్చించలేకపోయామని చెప్పారు. త్వరలోనే మేడిగడ్డ, సుందిళ్ల, అక్కడి పంప్‌హౌస్‌లను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

మంత్రివర్గ సమావేశం వాయిదా

ఎన్నికల కమిషన్ అనుమతి రానందున రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం కేబినేట్ సమావేశం నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కేబినేట్ సమావేశానికి ఇసి అనుమతి కోరింది. కానీ శనివారం రాత్రి వరకు ఇసి నుంచి అనుమతి రాలేదు. దీంతో శనివారం జరగాల్సిన కేబినేట్ భేటీ నిలిచిపోయింది. ఇసి నుంచి ఏ క్షణమైన అనుమతి వస్తుందని మంత్రులు అందరూ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సచివాలయంలో వేచి ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని విభాగాల అధికారులు కేబినేట్ భేటీకి హాజరయ్యేందుకు ఆఫీసులకు చేరుకున్నారు. కానీ రాత్రి 7 గంటల వరకు ఇసి నుంచి స్పందన లేకపోవటంతో కేబినేట్ భేటీ జరగలేదు. సీఎంతో పాటు మంత్రులు వెనుదిరిగి వెళ్లారు. రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన విషయాలపై ఈ భేటీలో చర్చించాలని ఎజెండా సిద్ధం చేసుకున్నారు. కానీ ఇసి నుంచి స్పందన లేకపోవటంతో రైతుల సంక్షేమం, అత్యవసరమైన అంశాలపై చర్చించలేకపోయామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. అందుకు సంబంధించిన వేడుకల నిర్వహణతో పాటు పునర్విభజనకు పదేండ్లు పూర్తి కావటంతో ఇప్పటివరకు రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలను కేబినేట్ భేటీలో చర్చించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కేబినేట్ భేటీ వాయిదా పడటంతో ఇవేవీ చర్చ జరగలేదు. ఇసి నుంచి అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే కేబినేట్ భేటీ జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. సోమవారం లోపు ఇసి నుంచి అనుమతి రాకపోతే, అవసరమైతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ని కలిసి అనుమతి కోరుతామని సిఎం చెప్పారు.

ఉచిత బస్సు సౌకర్యంపై మోడీ వ్యాఖ్యలు సరికావు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం సరైందికాదంటూ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఖండించారు. ఏ ఉద్దేశంలో ప్రధాని ఉచిత బస్సు ప్రయాణాన్ని వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నియమావళిని గౌరవించాల్సిన ప్రధాని వాటిని యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రామాలయాన్ని బుల్డోజర్‌తో కూల్చేస్తారంటూ ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఇది మత విశ్వాసాలను రెచ్చగొట్టడమేనన్నారు. మోడీ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి న్యాయస్థానం తీర్పే కీలకమని గుర్తు చేశారు. అందులో భాగంగానే గుడి నిర్మాణం జరిగిందని తెలిపారు. లౌకికవాదమంటే అన్ని మతాల భావాలను గౌరవించడమేనని వివరించారు.

తడిసిన ప్రతి గింజా కొంటాం : మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తడిచిన ప్రతీ గింజనూ రాష్ట్ర ప్రభుత్వం కొంటుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. అందువల్ల రైతులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కల్లాల్లోని ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.రాయబరేలీ ఎన్నికల ప్రచారంలో ఉన్న సీతక్క...శనివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు భరోసానిచ్చే విధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని సూచించారు. అలాగే ఇక నుంచి పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందని పేర్కొన్నారు. రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉంటుందని భరోసానిచ్చారు.

వాహన ఫిట్‌నెస్ మస్ట్!

- స్కూల్, కాలేజ్ బస్సులకు మొదలైన సామర్థ్య పరీక్షలు
- రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 23 వేల బస్సులు
- ఇప్పటివరకు 10-20 శాతం మేర బస్సులకే ఫిట్‌నెస్ పూర్తి
- ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే బండి సీజ్..!
- జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూన్ 12 నుంచి విద్యాసంస్థలు పున:ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బడి బస్సుల సామర్థ్య పరీక్షలపై(ఫిట్‌నెస్) రవాణాశాఖ దృష్టి సారించింది. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. ప్రతియేటా మే 15న స్కూల్, కాలేజ్ బస్సుల ఫిట్‌నెస్ ముగుస్తుంది. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను నిర్ణీత సమయంలోపు ఫిట్‌నెస్ చెక్ చేయించుకోవాలని ఆర్టీఏ అధికారులు సూచిస్తున్నారు. స్కూల్, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల కోసం నగరంలోని అన్ని ఆర్టీవో ఆఫీసులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన ఏర్పాట్లు చేశామని చెబుతున్నారు. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో విద్యా సంస్థల యాజమాన్యాలు ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని ఆర్టీఏ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రారంభమైన ఎఫ్‌సిల జారీ ప్రక్రియ

రాష్ట్రంలో దాదాపు 29వేలకుపైగా విద్యాసంస్థల బస్సులుండగా.. అందులో కాలం చెల్లినవి పోగా, 23వేలకు పైగా బస్సులుంటాయి. వీటిలో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 12,612 పాఠశాలలు, కళాశాలల బస్సులున్నాయి. వీటిలో హైదరాబాద్‌లో 2412, మేడ్చల్‌లో 5000, రంగారెడ్డిలో 5200 బస్సులున్నాయి. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా కాలం చెల్లిన బస్సులు(దాదాపు 6వేలు) మినహా అన్ని బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాలి. ఈ నెల 15 నుంచి ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా 10-20శాతం మేర బస్సులకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అయ్యాయి. వచ్చే నెల 12వ తేదీలోగా వందశాతం బస్సులకు వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల్లో ఈ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏవీఎంఐ, ఎంవీఐ, కానిస్టేబుల్స్, హోంగార్డులతో కూడిన ప్రత్యేక బృందాలు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేస్తాయి.

నిబంధనలు ఇలా..

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు పాఠశాల, కళాశాలల బస్సులకు తప్పనిసరిగా రవాణా శాఖ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ పరీక్షల్లో భాగంగా.. బ్రేకులు, ఇంజిన్ పనితీరు, డోర్లు, డ్రైవర్ అనుభవం తదితర అంశాలను పరిశీలిస్తారు. డ్రైవర్‌కు కనీసం అయిదేండ్ల అనుభవముండాలి. డ్రైవర్ లైసెన్స్‌తోపాటు క్లీనర్ ఫొటోలు, ఫోన్ నంబర్లు వాహనంలో ఉన్నాయా లేదా అనేది చూస్తారు. ఎంతమంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారనే లెక్కని, తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సహా బస్సుల్లో అతికించాలి. బస్సు రూట్‌మ్యాప్‌ను ఆర్టీఏ కార్యాలయంలో అందజేయాలి. 15 ఏండ్లు దాటిన వాహనాలను అనుమతించరు. విద్యాసంస్థల బస్సులకు పసుపు రంగు వేసి నాలుగు వైపులా ఆర్టీఏ రిజిస్ట్రేషన్ నంబర్ రాయాలి. కొత్త టైర్లతోపాటు స్టెప్నీ ఉండాలి. ఎమర్జెన్సీ ఎగ్జిట్ తప్పనిసరి. వర్షం పడితే నీళ్లు లోపలికి రాకుండా ఉండేందుకు బస్సు టాప్‌పై సీలింగ్ ఉండాలి. మూడు నెలలకోసారి డ్రైవర్ వైద్య పరీక్షలు చేసుకోవాలి. ఈ ఖర్చు యాజమాన్యమే భరించాలి. అలాగే డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలి. ఇలా మొత్తం 30-40 నియమ నిబంధనలను పాటించిన బస్సులకు మాత్రమే ఎఫ్‌సీ మంజూరు చేస్తారు.

15 ఏండ్లు దాటితే.. నో ఫిట్‌నెస్..!

వాహనం రిజిస్ట్రేషన్ అయిన నాటి నుంచి 15ఏండ్ల వరకు మాత్రమే రోడ్ల మీద తిరిగే అవకాశం ఉంటుంది. అటువంటి సామర్థ్యం ఉన్న వాహనాలను మాత్రమే విద్యాసంస్థలు కేటాయించాలి. ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్ల మీదికి వస్తే.. సీజ్ చేస్తారు. దానితో పాటు వాహన యజమానిపై కేసు నమోదు చేస్తారు.

ప్రతి బస్సు ఫిట్‌గా ఉండాల్సిందే..
: సి.రమేష్, జెటిసి, హైదరాబాద్

విద్యార్థులను తరలించే ప్రతి బస్సు ఫిట్‌గా ఉండాలి. బస్సుకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ పొందాలి. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో స్కూలు పిల్లలను తీసుకెళ్లి ప్రమాదాల బారిన పడొద్దు. ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్ల మీదకు వస్తే ఖచ్చితంగా సీజ్ చేయడంతోపాటు వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తాం. జెటిసి, డిటివోల పర్యవేక్షణలో ఆర్టీవో, ఎంవిఐ, ఏఎంవీఐలతో కూడిన ప్రత్యేక బృందాలను త్వరలో ఏర్పాటు చేస్తాం. వాహనాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వాహన బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ట్యాక్స్ రిసిప్ట్, పొల్యూషన్ సర్టిఫికెట్లతో పాటు డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్.. వంటి పత్రాలు సిద్ధం చేసుకోవాలి.

ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి అరెస్ట్

- జీడిమెట్ల డివిజన్‌లో రెండెకరాల భూమి తమదేనంటూ ఆందోళన..
- ఫెన్సింగ్ తొలగింపు
- రెండు గ్రూపుల మధ్య వివాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల డివిజన్‌లో భూ వివాదంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, ఆయన అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఆ భూమి తమదేనంటూ సుచిత్ర సర్కిల్ వద్ద వారు ఆందోళన చేపట్టి ఫెన్సింగ్‌లను తొలగించడంతో వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో పోలీసులు వారిద్దరిని అరెస్టు చేసి పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బిఆర్ఎస్ శ్రేణులు భారీగా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దాంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షతోనే మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయించిందని బిఆర్ఎస్ శ్రేణులు ఆరోపించారు.

వివరాల్లోకి వెళ్తే.. సుచిత్ర పరిధిలోని సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి విషయమై మాజీ మంత్రి మల్లారెడ్డి, 15 మంది మధ్య భూ వివాదం ఉంది. ప్రస్తుతం ఈ వివాదం కోర్టు పరిధిలో ఉంది. అయితే, తమ స్థలాన్ని కొందరు ఆక్రమించుకుంటున్నారంటూ.. మాజీ మంత్రి మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి శనివారం ఉదయం వివాదాస్పద స్థలం వద్దకు చేరుకున్నారు. అక్కడే టెంట్లు వేసి క్యాంప్ ఏర్పాటు చేసిన ప్రత్యర్థులను చూసి కోపంతో.. స్థలంలో వేసిన బారికేడ్లను తొలగించాలని వారి అనుచరులను ఆదేశించారు. దీనిపై అవతలి వారు 15 మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా.. వారితో మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. సర్వే నెంబర్ 82లో ఉన్న రెండున్నర ఎకరాల భూమి తనదేనంటూ మల్లారెడ్డి వాదించారు. అయితే అందులో 1.11 ఎకరాల భూమి తమదంటూ మరో 15 మంది వ్యక్తులు వాదనకు దిగారు. తాము ఒక్కొక్కరం 400 గజాల చొప్పున గతంలో భూమి కొనుగోలు చేశామని వారు చెప్పారు. కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు ఆర్డర్ ఉన్నందున ఘటనా స్థలంలో ఎలాంటి గొడవలూ చేయొద్దని ఇరువురికీ పోలీసులు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా మల్లారెడ్డి వినిపించుకోకపోవడంతో ఆయనను, అల్లుడు రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేసి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, మల్లారెడ్డి అనుచరులు తమను భయపెడుతున్నారని సదరు 15 మంది వ్యక్తులు ఆరోపించారు.

మా జాగ కబ్జా చేసిన్రు : మల్లారెడ్డి

తన రెండెకరాల భూమిలో అర్ధరాత్రి కొందరు దౌర్జన్యంగా చొరబడి కబ్జా చేశారని మల్లారెడ్డి ఆరోపించారు. ఉన్న నిర్మాణాలు కూల్చి వేశారని, తన భూమిలో అక్రమంగా ఫెన్సింగ్ వేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దౌర్జన్యం పెరిగిందన్నారు. కాంగ్రెస్ విప్ లక్ష్మణ్, శ్రీనివాస్ రెడ్డిపై ఆయన ఆరోపణలు చేశారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. హైదరాబాద్ నగరంలోని మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, నిజాంపేట్, ప్రగతినగర్, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్, గండిమైసమ్మ, ఎల్బీనగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లో గంటకు 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. వనస్థలిపురం చింతలకుంట వద్ద జాతీయరహదారిపై భారీగా వరద నీరు చేరడంతో హైదరాబాద్ - విజయవాడ రహదారి చెరువును తలపించింది. దీంతో పనామా- ఎల్బీనగర్ మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఎంఎటికి దరఖాస్తుల ఆహ్వానం : ఎఐఎంఎ

హైదరాబాద్ : ఎంబిఎ, పిజిడిఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశాల కోసం ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎఐఎంఎ) ఆధ్వర్యంలో జరగనున్న మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎంఎటి)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ టెస్ట్ వరంగల్‌లో జూన్ 2వ తేదీన జరగనుంది. ఈ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షతో దేశంలో 600 పైగా మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్యూషన్లలో ప్రవేశాలు పొందడానికి వీలుందని ఎఐఎంఎ తెలిపింది. అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

డిస్కం పేరు మార్పు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టిఎస్ఎస్‌పిడిసిఎల్) పేరు మారింది. టిఎస్ స్థానంలో టిజిగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల పేర్లను టిఎస్ స్థానంలో టిజిగా మార్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు ఇచ్చారు. దానిలో భాగంగా టిఎస్ఎస్‌పిడిసిఎల్ పేరును టిజిఎస్పిడిసిఎల్‌గా మారుస్తూ ఆ సంస్థ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డిస్కం పేరును సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్‌గా మార్చారు. సంస్థ లోగోలోనూ సవరణలు చేసి, కొత్త లోగోను విడుదల చేశారు.

మోడీ నిజస్వరూపం బయటపడింది : నిరంజన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహిళలను వ్యతిరేకించే బిజెపి నిజస్వరూపం మోడీ వ్యాఖ్యలతో మరోసారి బయటపడిందని పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో మెట్రో నష్టపోతుందంటూ మోడీ అనడం మహిళలను అగౌరవ పరచడమేనన్నారు. తెలంగాణలో మహిళలు సంతోషపడుతుంటే మోడీకి కంటగింపుగా ఉందని ఎద్దేవా చేశారు. కార్పొరేట్ సంస్థల రుణాలు మాఫీ చేసినప్పుడు ఎందుకు ఈ విధంగా ఆలోచించలేదని ప్రధానిని ఆయన ప్రశ్నించారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో బిసి గురుకుల స్ఫూర్తికి 369వ ర్యాంక్

- బిసి గురుకుల విద్యార్థుల విజయఢంకా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంసెట్ 2024 ఫలితాల్లో మహాత్మా జ్యోతి బా పూలే బిసి గురుకుల విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించి విజయఢంకా మోగించారు. అగ్రికల్చర్ విభాగంలో స్ఫూర్తి అనే విద్యార్థిని 369వ ర్యాంక్ సాధించింది. ఇంజనీరింగ్, మెడికల్, అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ పరీక్షలో అగ్రికల్చర్ విభాగంలో అత్యధిక మంది విద్యార్థులు ర్యాంక్‌లు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో మొత్తం 145 మంది బాలికలు పరీక్ష రాయగా వారిలో 114 మంది అర్హత సాధించారు. స్ఫూర్తి 369 ర్యాంక్ సాధించి బిసి గురుకుల బాలికల ప్రతిభను నిరూపించింది. 12 మంది ఐదువేల లోపు ర్యాంకులను, 29 మంది బాలికలు పదివేల లోపు ర్యాంక్‌లు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో 25 మంది బాలురు పరీక్ష రాయగా వారిలో నలుగురు బాలురు మంచి ర్యాంకులను సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 276 మంది బాలికలు పరీక్ష రాయగా వారిలో ఇద్దరు పదివేల లోపు ర్యాంక్ సాధించారు. 191 మంది అర్హత సాధించారు. 135 మంది బాలురు పరీక్ష రాయగా వారిలో ఐదుగురు పదివేల లోపు ర్యాంక్‌లు సాధించారు. 107 మంది క్వాలిఫై అయ్యారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులు మరిన్ని ర్యాంకులు సాధించేలా ఉన్నత నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించాలని, విద్యార్థులు మరింత కష్టపడి మంచి ర్యాంకులు సాధించాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. బిసి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో గురుకులాలు పనిచేస్తున్నాయని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. 369 ర్యాంకులు సాధించిన స్ఫూర్తిని, ఇతర విద్యార్థులను, బోధనా సిబ్బందిని మహాత్మా జ్యోతి బా పూలే బిసి గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు ఈ సందర్భంగా అభినందించారు.

నేడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ స్మారకోపన్యాసం

- ముఖ్యవక్తగా సుప్రీం కోర్టు అడ్వకేట్ డాక్టర్ ఎస్ మురళీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టు అగ్ర నాయకుడు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, నిష్కళంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్మారకోపన్యాసాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 5గంటలకు బాగ్‌లింగంపల్లిలోని ఎస్‌వికెలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రస్ట్ కార్యదర్శి ఎస్ వినయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం భావ ప్రకటనా స్వేచ్ఛ నేటి వాస్తవాలు' అనే అంశంపై స్మారకోపన్యాసం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్‌వికె ట్రస్ట్ చైర్మన్ బివి రాఘవులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఒరిస్సా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ డాక్టర్ ఎస్ మురళీధర్ స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. కార్యదర్శి నివేదికను వినయకుమార్ ప్రవేశపెడతారనీ, మేనేజింగ్ కమిటీ సభ్యులు జి బుచ్చిరెడ్డి స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. ప్రజాక్షేమమే పరమావధిగా, ఉద్యమమే ఊపిరిగా ప్రజాసేవకు అంకితమై ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సుమారు ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రముఖుడని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని సిపిఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. అదేవిధంగా ఇప్పుడు కూడా బిజెపిని ఓడించటం కోసం ఇండియా కూటమిలో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. పట్టభద్రులైన ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలనీ, బిజెపిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

న్యాయవాదులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ వర్తింప చేయాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల చివరి నాటికి కాలపరిమితి తీరబోతున్న అడ్వకేట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని 2019 సంవత్సరం తర్వాత వృత్తిలోకొచ్చిన యువ న్యాయవాదులకు కూడా వర్తింప చేసి హెల్త్ కార్డులు జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఎఐఎల్‌యు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ ప్రతినిధి బృందం శనివారం న్యాయ శాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి ని రాష్ట్ర సచివాలయంలోని ఆయన కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. 2024-2025 సంవత్సరానికి కొత్త గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీకి న్యాయవాదుల జాబితాను సరిచేయాలనీ, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, ప్రస్తుత జాబితాలో లేని యువ న్యాయవాదుల పేర్లు చేర్చాలని ఈ సందర్భంగా యూనియన్ నేతలు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ బార్ కౌన్సిల్ నుంచి మొత్తం సమాచారాన్ని తెప్పించుకుని, బార్ అసోసియేషన్ల సమన్వయంతో జాబితా తయారు చేయాలని కోరారు. వయో పరిమితి విధించకుండా న్యాయవాదులందరికీ భీమా సౌకర్యం వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ నుంచి న్యాయవాదులకు, వారి కుటుంబ సభ్యులకు, వైద్య ఖర్చుల నిమిత్తం జారీ చేస్తున్న గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని రూ. రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షలకు పెంచాలని కోరారు. వివిధ ప్రాంతాల న్యాయవాదులు తక్షణ నగదు రహిత చికిత్సను పొందేందుకు సహాయపడే నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాలో అన్ని జిల్లా హెడ్ క్వార్టర్లలో ఉన్న మరికొన్ని ఆస్పత్రులను జోడించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయవాదుల తల్లిదండ్రులకు కూడా భీమా కవరేజీని విస్తరింప చేయాలని కోరారు. ప్రసూతి ఖర్చులు కూడా పాలసిలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రతినిధి బృందంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఎఐఎల్‌యు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి.విద్యాసాగర్, అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, కోశాధికారి ఇ. వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు చందాల శైలజ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, రమేష్ కుమార్ మక్కడ్, పి కిషన్ రావు, ఎం శంకరయ్య, వై.మంజులత ఉన్నారు.

స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

- బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బిసిలంతా ఏకమై ఉద్యమాలు చేపడతారని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందిందనీ, కుల గణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రణాళికలో భాగంగా కామారెడ్డి విజయభేరి బహిరంగసభలో బిసి డిక్లరేషన్‌ను ఆ పార్టీ ప్రకటించిందని గుర్తు చేశారు. ఆ డిక్లరేషన్ ప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కులగణన చేపట్టి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నిలను నిర్వహిస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బడ్జెట్‌లో బిసిలకు రూ. లక్ష కోట్లు కేటాయిస్తామని, ఎంబిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసిందన్నారు. కానీ..వాటి గురించి కాంగ్రెస్ ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే బిసిలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బిసి జనసభ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 22న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు,సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. 25న అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని, వచ్చేనెల 8న చలో ఇందిపార్కు కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని చెప్పారు.15న సచివాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాగేందర్, సూర్య, మేకల కృష్ణ, సంతోష్, మధు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించండి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న శాసనమండలి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల్లో కాంగ్రెస్ మాత్రమే రాజ్యాంగాన్ని రక్షించడంలో, లౌకిక విధానాన్ని కొనసాగించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నదని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్యుడు జీవించడానికి కాస్త దోహదపడుతున్న పార్టీగా అది ఉందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనలోనూ ముందున్నదని వివరించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడే పార్టీగా ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థినే ఎమ్మెల్సీగా గెలిపించుకోవడం మంచిదని తెలిపారు. బిజెపి ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చుపెట్టడం, కాకులను, గద్దలను కొట్టి రాబంధులకు వేసినట్టు బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నదని పేర్కొన్నారు. విద్యారంగాన్ని నూతన విద్యావిధానం పేరుతో పూర్తిగా ప్రయివేటీకరించే విధానాలతో పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఇలాంటి పార్టీకి ప్రజాప్రతినిధిని గెలిపించడమంటే ప్రజలు తమ కంట్లో తామే పొడుచుకున్నట్టేనని తెలిపారు. బిఆర్ఎస్ కూడా బిజెపి దారిలో పోతున్నట్టే కనిపిస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. కొత్త బడులను పెట్టి, పాత బడులను మూసివేసినట్టు ఆ పార్టీ విధానాన్ని కొనసాగించిందని గుర్తు చేశారు.

‘ఎరుపు’ పాలనతో ‘హవేలీ’ ఆదర్శం

- నేడు సత్తెనపల్లి రామకృష్ణ భవన్ ప్రారంభోత్సవం
- ప్రారంభకులు కేరళ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కెకె శైలజా టీచర్
- రెడ్ షర్ట్ వలంటీర్లతో కవాతు - ప్రదర్శన- బహిరంగ సభ
- ఖమ్మం హవేలీ అభివృద్ధిలో సిపిఎం కీలకపాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం ఖానాపురం హవేలీ ప్రాంతం అభివృద్ధిలో సిపిఎం కీలక భూమిక పోషించింది. ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనానికి ముందు దాదాపు 40 ఏండ్లపాటు హవేలీ సర్పంచ్, ఎంపిటిసి పాలనా బాధ్యతలను నిర్వహించిన సిపిఎం హయాంలో ఆ ప్రాంతం ప్రగతి పథంలో ముందుకు నడిచింది. ఆ ప్రాంతానికి చెందిన విద్యుత్ పోరాట యోధుడు సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో స్థానిక ఇందిరానగర్ సెంటర్లో నిర్మించిన సిపిఎం ఖానాపురం హవేలీ కమిటీ నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు ఈ భవనాన్ని కేరళ రాష్ట్ర శాసనసభ్యులు, ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కెకె శైలజ టీచర్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హాజరవుతున్నారు. ఆఫీస్ పక్కనే ఉన్న వినియోగదారుల ఫోరం స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు.

సిపిఎం కృషితో మారిన రూపురేఖలు

సిపిఎం హయాంలో కార్పొరేషన్‌కు దీటుగా ఖానాపురం హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందింది. పార్టీ ప్రస్తుత జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుగ్గవీటి సరళ ఆనాడు సర్పంచ్‌గా ఈ ప్రాంత అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లారు. పార్టీ పోరాటాల ఫలితంగానే ఈ ప్రాంత పేదలకు ఇళ్ల స్థలాలు సమకూరాయి. ఫ్లోరైడ్ రహిత మంచినీటి సరఫరా ప్రారంభమైంది. రస్తోగినగర్, వేణుగోపాల్ నగర్- 1, 2లో పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేశారు. వైఎస్ఆర్ నగర్‌లో 2000 మందికి స్థలాలు కూడా సిపిఎం చేసిన పోరాట ఫలితంగానే సిద్ధించాయి. హవేలీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల కాలనీలూ ఏర్పడ్డాయి. ఈ పోరులో భాగంగా 250 మందికిపైగా సిపిఎం కార్యకర్తలు అరెస్టై జైలు పాలయ్యారు. ఖమ్మం నగరానికి తలమానికంగా ఉన్న అపార్ట్‌మెంట్ నిర్మాణాలు, వర్తక వాణిజ్యమాల్స్ కూడా హవేలీ ప్రాంతం నుంచే అభివృద్ధి చెందాయి. సిసి రోడ్లు, లింకు రోడ్‌లు ఇలా అనేకం హవేలీ ప్రాంతంలో ఏర్పడ్డాయి. సురక్షిత ప్రాంతంగా హవేలీ అభివృద్ధి చెందడంతో గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి ప్రజానీకం తరలివచ్చి ఇక్కడ నివాసముంటూ పిల్లలను చదివించుకుంటున్నారు. ఇప్పుడు ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గానూ ఘనతికెక్కింది. ఖమ్మం నగరానికి తలమానికంగా హవేలీ ప్రాంతం అభివృద్ధి చెందిందంటే అది సిపిఎం కృషి ఫలితమేనని స్థానిక ప్రజానీకం చర్చించుకుంటున్నారు.

అకడమిక్ గ్రంథాలయం... వైద్య శిబిరం

సిపిఎం హవేలీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకే కాకుండా అకాడమిక్ గ్రంథాలయంతో పాటు ప్రతినెలా ఓ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు మెడికల్ క్యాంపులు నడుస్తున్నాయి. ఏడో క్యాంపు హవేలీ కార్యాలయంలో ప్రారంభమవుతుందని పార్టీ హవేలీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు వెల్లడించారు. ఈ వైద్య శిబిరంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన రూ.3000 విలువచేసే మందులను రూ.100కు అందిస్తారు. సత్తెనపల్లి భవన్ నిర్మాణానికి కృషి చేసిన, సహకరించిన ప్రతి ఒక్కరికీ సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గఫ్ఫార్, ఎస్ఐ మహ్మద్ గౌస్, ఆర్ఐ ప్రభాకర్

లారీల కోసం రైతుల రాస్తారోకో

- లోడింగ్ అన్ లోడింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లారీల కొరతతో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని.. వెంటనే అవసరమైన లారీలను తెప్పించాలని రైతులు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని దుంపలకుంట చౌరస్తాలో ఎనగండ్ల గ్రామ రైతులు శనివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసినా.. సకాలంలో లారీలు రాక, అన్ లోడింగ్ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం పడుతుండటంతో కొన్నిచోట్ల ధాన్యం మొలక వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి సకాలంలో లారీలను పంపాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న తహసీల్దార్ గఫ్ఫార్, ఎస్ఐ మహ్మద్ గౌస్, ఆర్ఐ ప్రభాకర్ అక్కడికి వచ్చారు. లారీల సమస్యను సాధ్యమైనంత త్వరలో రైస్ మిల్లర్లతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు.

రసాయనాలతో మాగపెట్టిన మామిడి పండ్ల లారీల పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృత్రిమంగా.. రసాయనాలతో మాగపెట్టిన మామిడి పండ్ల లారీలను రాష్ట్ర వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న ఆరు లారీలను శనివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై దేవాపూర్ చెక్ పోస్ట్ వద్ద అడ్డుకున్నారు. మామిడి కాయలను పండ్లుగా మార్చడం కోసం రసాయనాలు వినియోగించడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తాయని వారు తెలిపారు. క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. మామిడి పండ్లను రవాణా చేస్తున్న లారీలను ఆపి సోదాలు జరిపి వివరాలు సేకరించి పట్టుకున్నట్టు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ జాతీయ సంఘం నుంచి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ, జిల్లా అధ్యక్షులు దోమటి కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ ఇర్ఫాన్, ఫుడ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మహమ్మద్ షకిల్ పాల్గొన్నారు.

పోస్టాఫీసు ఎదుట రైతుల నిరసన

- పంట డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోస్టాఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

తమ పంట డబ్బులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు పోస్టాఫీసు ఎదుట నిరసన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన పోస్టాఫీసు ఎదుట శనివారం పురుగులమందు డబ్బాలు చేతపట్టుకొని ఆందోళనకు దిగారు. మూడు నెలల కిందట రైతులను నమ్మించి పోస్టల్ ఖాతాలో ఉన్న పత్తి విక్రయించిన డబ్బులను ఆదిలాబాద్ పోస్టాఫీస్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ తన ఖాతాల్లోకి మళ్లించుకొని మాయం చేశారు. ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు పోస్టాఫీస్‌కు వెళ్లి నిలదీయగా.. మేనేజర్ కాజేసిన విషయం బహిర్గతమైంది. ఈ విషయమై కేసు నమోదు చేసిన పోలీసులు సదరు మేనేజర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. మూడు నెలలైనా తమ డబ్బులు ఇంకా ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. పురుగులమందు డబ్బాలు తీసుకొని పోస్టాఫీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న పోస్ట్ ఆఫీసు సిబ్బంది జీఎం జనార్ధన్‌తో ఫోన్లో మాట్లాడించారు. ఈ నెలాఖరులోగా లేదా వచ్చే నెలలో డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని ఆయన భరోసా ఇచ్చారు. అది నమ్మని రైతులు నిరసన కొనసాగించారు. పోలీసులు అక్కడి చేరుకొని రైతులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. పత్తి అమ్మిన డబ్బులను పోస్టాఫీసు మేనేజర్ కాజేసి నాలుగు నెలలు గడుస్తోందని, ఇప్పటి వరకు వాటిని రికవరీ చేసి తమకు అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 79 మందిమి మోసపోయామని, త్వరలోనే తమ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆర్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

మీడియాతో మాట్లాడుతున్న జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్లు

బిల్లులు చెల్లించే వరకు పనులు చెయ్యం

- జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్ల నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెయ్యి కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు పనులను నిలిపివేస్తున్నట్టు జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్లు ప్రకటించారు. శనివారం జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్లు హైదరాబాద్‌లోని బల్దియా ప్రధాన కార్యాలయంలోని కాంట్రాక్టర్స్ యూనియన్ కార్యాలయం ముందు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. గురువారం అబిడ్స్‌లోని సర్కిల్-14 కార్యాలయంలో ఇరుగదిండ్ల రాము అనే కాంట్రాక్టర్ గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. సంవత్సర కాలంగా పెండింగ్ బిల్లులు రాకపోవడంతోనే ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడి కారణంగా రాము గుండెపోటుకు గురై మరణించాడని తోటి కాంట్రాక్టర్లు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్లు పోరు బాటపట్టారు. ఈ ఏడాది మార్చి వరకు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లిస్తేనే పనులు చేస్తామని, కొత్తగా వచ్చే ఏ పనులనూ చేపట్టబోమని చెప్పారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి 2023 ఏప్రిల్ నుంచి రూ.1,350 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని, వాటిని వెంటనే ప్రభుత్వం రిలీజ్ చేయాలని జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం సురేందర్ సింగ్‌తోపాటు ప్రతినిధులు డిమాండ్ చేశారు. బల్దియా పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడంతోనే కాంట్రాక్టర్లు అప్పులపాలవుతున్నారని, ఆ ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త పనులకు టెండర్లు వేయొద్దని, ముఖ్యంగా మాన్సూన్ పనులకు టెండర్లు వేయొద్దని అసోసియేషన్ నిర్ణయించింది. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని జిహెచ్‌ఎంసి కాంట్రాక్టర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎఐలో హైదరాబాద్‌ను టాప్‌లో నిలుపుతాం

- మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ : ఐటి రంగంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని.. తాము దానిని నంబర్ స్థానంలోకి చూడాలనుకుంటున్నామని ఐటి శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ ఫెసిలిటీ మేనేజర్స్ కౌన్సిల్ (టిఎఫ్ఎంసి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ మేనేజర్ల సమ్మిట్‌కు మంత్రి హాజరై మాట్లాడారు. తెలంగాణకు మళ్లీ అత్యుత్తమ మేధావులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌ను భారత ఎఐ రాజధానిగా ఉంచాలని తాము కోరుకుంటున్నామన్నారు. ఎఐ సిటీగా చూడాలన్నది తమ కోరికని.. ఇందుకోసం ప్రత్యేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. ఎఐ రాజధానిగా మార్చడానికి ఇప్పటికే 200 ఎకరాల భూమిని కేటాయించామన్నారు.

గుజ్జ ప్రేమేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును ఉమ్మడి నల్లగొండ- వరంగల్ - మెదక్ జిల్లాల బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జ ప్రేమేందర్‌రెడ్డికి వేసి గెలిపించాలని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక వివేరా హోటల్‌లో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సన్నాహక సమావేశం బిజెపి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండుటెండలను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు సమిష్టి కృషితో భువనగిరి పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ గెలుపునకు బాటలు వేశారని ప్రశంసించారు. అదే స్ఫూర్తితో రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రతి కార్యకర్తా అభ్యర్థిగా భావించి ఓటర్లను కలిసి వారి మొదటి ప్రాధాన్యత ఓటును గుజ్జ ప్రేమేందర్‌రెడ్డికి వేసేలాగా చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జ ప్రేమేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీలు రామచందర్‌రావు, జనార్ధన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వెంకటేష్ నేత, గంగిడి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తల్లిని కడతేర్చిన కుమారుడు

- పిల్లలనూ చంపి పరారైన నిందితుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో దారుణం జరిగింది. ఆస్తి కోసం కన్న తల్లిని, పిల్లలను కడతేర్చాడు ఓ వ్యక్తి. ఎకరం వ్యవసాయ భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం తన ఇద్దరు పిల్లలను, తల్లిని హత్య చేశారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లుకు 11 ఏళ్ల కిందట దుర్గతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరమ్మాయిలు నీరజ (10), ఝాన్సీ (6) సంతానం. వెంకటేశ్వర్లు తల్లి పిచ్చమ్మ (60) కూడా వీరితోనే ఉంటుంది. రెండు సంవత్సరాల కిందట దుర్గ చనిపోయింది. దుర్గను వెంకటేశ్వర్లు హత్య చేశాడని ఆరోపణలు ఉన్నాయి. అయినా.. పిల్లలకు ఆసరా ఉండదనే ఉద్దేశంతో దుర్గ కుటుంబ సభ్యులు అతనిపై కేసు పెట్టలేదు. అతని పేరుపై ఉన్న ఎకరం వ్యవసాయ భూమి, ఇంటి విషయమై గ్రామంలో పంచాయితీ పెట్టించి తల్లి, ఇద్దరు పిల్లల పేరున రాయించారు. వెంకటేశ్వర్లు భార్య చనిపోయిన తరువాత ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకొని ఆమెతో సహజీవనం చేస్తూ వేరే చోట ఉంటున్నాడు. పిల్లలు నానమ్మ వద్ద ఉంటున్నారు.

హత్యకు కారణం..

తల్లి, పిల్లల పేరుపై ఉన్న భూమిని విక్రయించేందుకు వెంకటేశ్వర్లు రెండుసార్లు ప్రయత్నించాడు. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు అడ్డు చెప్పడంతో కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా ముగ్గురిని అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో శనివారం తెల్లవారుజామున ముగ్గురిని గొంతు పిసికి హత్య చేసి పారిపోయాడు. తెల్లవారినా ఇంటి నుంచి ఎవరూ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు వారు వెళ్లి చూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గ్రామ పెద్దలు పోలీసులకు సమాచారం అందించారు. వైరా ఎసిపి రెహమాన్, సిఐ ఎన్ సాగర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రశాంతంగా ఉండే గ్రామం మూడు హత్యలతో ఉలిక్కిపడింది.

సన్న వడ్ల సాగుపై సందిగ్ధం

- రూ.500 బోనస్ ఆ వడ్లకేనంటూ సిఎం ప్రకటన
- ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆందోళన
- వరి సాగులో 90 శాతం దొడ్డు రకమే
- యాసంగిలో సన్నరకం పండటం కష్టం
- ఖరీఫ్‌లో సాగు చేసినా అధిక తెగుళ్ల బెడద, సరిపడ దిగుబడి రాదు
- అన్ని రకాల వడ్లకూ బోనస్ ఇవ్వాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సన్న రకాల ధాన్యం పండించిన రైతులకే రూ.500 బోనస్ ఇస్తాం. దొడ్డు రకం ధాన్యాన్ని ఎఫ్‌సిఐ కొనుగోలు చేస్తుంది. సన్న రకాలు పండించే రైతుకు ప్రోత్సాహకాలిస్తాం. హాస్టళ్లు, రేషన్‌కార్డులపై సన్న బియ్యం పంపిణీ కోసం సన్నొడ్లను పండించాలి' అంటూ సిఎం రేవంత్‌రెడ్డి మనసులోని మాటను వ్యక్తం చేశారు. సిఎం వ్యాఖలను బట్టి పరిశీలిస్తే.. కేవలం సన్న రకాల ధాన్యం పండించిన రైతులకు మాత్రమే బోనస్ ఇచ్చి దొడ్డు రకం వడ్లు పండించే రైతులకు ఇవ్వరనేది స్పష్టమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చి హామీలో మాత్రం రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక మాత్రం కేవలం సన్న వడ్లకే ఇస్తామనడంతో రైతుల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో ఏ రకం వడ్లను సాగు చేయాలనేది సందిగ్ధంగా మారింది. దేశంలోనే వరి సాగులో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉంది. పండించే ధాన్యంలో 90 శాతం దొడ్డు రకమే ఉంది. ఖరీఫ్, యాసంగి రెండు సీజన్లలోనూ రైతులు దొడ్డు రకాల్నే పండిస్తున్నారు. ఖరీఫ్‌లో కొంత సన్న రకం సాగు చేసినా వ్యాపారులు, మిల్లర్లు కొనగా రైతు అవసరాల కోసమే ఉంచుకుంటారు. దాంతో రూ.500 బోనస్ అనేది రైతుకు అందని ద్రాక్షే కానుంది.

సన్న వడ్ల సాగు ప్రశ్నార్థకమే

రాష్ట్రంలో సన్న రకాల ధాన్యాన్ని పండించడం ప్రశ్నార్థకంగా మారింది. వరి సాగును పరిశీలిస్తే.. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో సన్న రకాల్ని 30 నుంచి 40 శాతమే సాగు చేస్తారు. దొడ్డు రకం వరిని 60 నుంచి 70 శాతం సాగు చేస్తారు. యాసంగి సీజన్‌లో అయితే సన్నలు కేవలం 10 నుంచి 15 శాతమే సాగు చేస్తారు. 90 శాతం దొడ్డు రకం ధాన్యాన్నే సాగు చేస్తూ వచ్చారు. సన్న రకాల్ని పండించేది కూడా నల్లగొండ, నిజామాబాద్, వరంగల్ ప్రాంతాల్లోనే పండిస్తున్నారు. సన్న ధాన్యాన్ని వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేస్తారు. కొంత మేర రైతులు తమ అవసరాల కోసం ఉంచుకుంటారు. వరి సాగు అధికంగా ఉండే సిద్దిపేట, మెదక్, కరీంనగర్, సంగారెడ్డి ఇతర ప్రాంతాల్లో సన్న వడ్ల సాగు నామమాత్రంగా ఉంటది. సన్న రకం వరిని సాగు చేస్తే ఖరీఫ్ సీజన్‌లో విపరీతంగా తెగుళ్ల బెడద ఉంటుంది. పంట దిగుబడి వచ్చే లోపు ఐదారు సార్లు పురుగు మందుల్ని పిచికారి చేయాలి. దోమకాటు వస్తే పంటంతా దెబ్బతింటది. దిగుబడులు ఎకరాలకు 20 బస్తాలు కూడా రాదు. పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువ ఉన్నందున్నే రైతులు సన్నాల సాగుకు దూరమయ్యారు. గతంలోనూ కేంద్రం, ఎఫ్‌సిఐ దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని తేల్చి చెప్పింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల్ని సాగు చేయాలని ప్రోత్సహించింది. కొందరు సాగు చేసినా కొనుగోళ్లు చేయక ఇబ్బందులు పడ్డారు.

బోనస్ భారం తగ్గించుకునేందుకేనా..?

క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల్లో రైతులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే యాసంగి సీజన్ ధాన్యం దిగుబడులు వచ్చాయి. రైతులు బోనస్ ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ నుంచి ఇస్తామని ప్రకటించింది. ఖరీఫ్ పంటల సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో సిఎం రేవంత్‌రెడ్డి బోనస్ కేవలం సన్న రకాలు పండిస్తేనే ఇస్తామంటూ సెలవిచ్చారు. రాష్ట్రంలో ఏటా 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. కోటీ లక్షల టన్నుల వరకు ధాన్యం దిగుబడులొస్తాయి. ఈ లెక్కన బోనస్ ఇవ్వాల్సి వస్తే ఏటా రూ.ఐదు నుంచి ఏడు వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుంది.

ఇంత భారాన్ని మోయలేని పరిస్థితుల్లోనే సిఎం కేవలం సన్నలకే ఇస్తామని మాట మార్చి నట్టు విపక్షాలు, రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. రైతులు పండించే సన్న వడ్లను వ్యాపారులు, మిల్లర్లు పోటీ పడి ఎక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వానికి అమ్మేది తక్కువే ఉంటది. పది ఇరవై లక్షల టన్నులకు బోనస్ ఇవ్వాల్సి వస్తే వెయ్యి కోట్లతో పనైపోతుందని సిఎం భావిస్తున్నట్టు చెబుతున్నారు.

ఖరీఫ్ సాగుపై అస్పష్టత

ముందస్తు రుతుపవనాలు వస్తాయని చెప్పడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వివిధ రకాల పంటలేసుకునేందుకు దుక్కులు దున్ని విత్తనాలు సమకూర్చుకునే పనిలో పడ్డారు. ఇంతలో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో రాష్ట్రంలోని రైతుల్లో అస్పష్టత నెలకొంది. సంగారెడ్డి జిల్లాలో వరి 1.50 లక్షల ఎకరాల్లో మెదక్ జిల్లాలో 3.27 లక్షల ఎకరాల్లో సిద్దిపేట జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇందులో 90 శాతం దొడ్డు రకం వరినే సాగు చేస్తారు. సిఎం ప్రకటన వల్ల బోనస్ రాదనే గుబులుతో సన్నరకం సాగు చేయాలా..? దొడ్డు రకం వేయాలా..? అనే గందరగోళంలో రైతులున్నారు.

వడ్లకు బోనస్ ఇవ్వాలి: ఆముదాల మల్లారెడ్డి, సిద్దిపేట జిల్లా సిపిఎం కార్యదర్శి

రైతులు పండించే అన్ని రకాల వరి ధాన్యానికీ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలి. సన్న రకాలకే బోనస్ ఇస్తామని చెప్పడం సరైందికాదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ వేరు సిఎం రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలు వేరుగా ఉన్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలయ్యాక మాట మార్చడం భావ్యం కాదు. 90 శాతం పండించే దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వబోమని చెప్పడమంటే రైతుల్ని విస్మరించడమే అవ్వుద్ది. అందరికీ ఇస్తామని సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి.

ఉద్యోగాలిప్పిస్తామంటూ లక్షల్లో వసూలు

- నమ్మించేందుకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు
- పాత నేరస్థుడు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే, ఆదాయపు పన్ను శాఖల్లో బ్యాక్‌లాగ్ ఉద్యోగాలిపిస్తానంటూ అమాయకులను మోసం చేసి లక్షలు దండుకున్న పాత నేరస్థున్ని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. డిసిపి ఎస్ రష్మీ పెరుమాళ్ శనివారం వివరాలు వెల్లడించారు.. ఆంధ్రప్రదేశ్ తెనాలికి చెందిన సూర్యదేవర అనిల్‌కుమార్ హైదరాబాద్ యాప్రాల్‌లో నివాసముంటున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే తక్కువ సమయంలో పెద్దఎత్తున డబ్బులు వస్తాయని పథకం వేశాడు. వివిధ గ్రూపులు, తెలిసిన వారు, స్నేహితుల ఫోన్ నెంబర్లతో ఓ వాట్సాప్ గ్రూప్ సృష్టించాడు. దాని ద్వారా అమాయకులను ఎంచుకుని టార్గెట్ చేసేవాడు. వారితో చాటింగ్ చేసి దక్షిణ మధ్యరైల్వే, పాట్నాలోని ఆదాయపు పన్ను శాఖల్లో పెద్దఎత్తున ఇన్‌స్పెక్టర్ ర్యాంక్, టిటిఇ తదితర బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నమ్మించాడు. నవీన్‌కుమార్ అనే వ్యక్తితో కలిసి ఒక్కో ఉద్యోగానికి రూ.5 నుంచి 10 లక్షలు డిమాండ్ చేసేవాడు. డబ్బులిచ్చిన వారికి సూర్యదేవర అనిల్ కుమార్ నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ కాపీలు ఇచ్చేవాడు. ఆరు నెలల ట్రైనింగ్ పేరుతో మరికొంత డబ్బులు దండుకునేవాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన హుస్సేన్ అనే వ్యక్తిని టార్గెట్ చేసిన నిందితుడు.. వాట్సాప్ గ్రూప్‌లో చేర్చాడు. రైల్వే శాఖలో ‘టిటిఇ’ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షలు డిమాండ్ చేశాడు. డబ్బులు తీసుకున్న నిందితుడు.. బాధితున్ని పాట్నాకు పిలిపించి సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేలో ‘టిటిఇ’గా ఉద్యోగం వచ్చిందని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను అందించాడు. నవీన్ కుమార్ అనే టిటిఇ వద్ద ఆరు నెలలపాటు ట్రైనింగ్ చేయాలని చెప్పాడు. దాంతో బాధితుడు సికింద్రాబాద్‌కు చేరుకుని నవీన్ కుమార్‌ను సంప్రదించడంతో అతను అదనపు డబ్బులు డిమాండ్ చేశాడు. అనుమానం వచ్చిన బాధితుడు గోపాలపురం పోలీసులను ఆశ్రయించాడు. డిసిపి రష్మీ పెరుమాళ్ ఆదేశాలతో నిందితుడిని అరెస్టు చేసి విచారించడంతో అతనిపై పలు కేసులున్నాయని తేలింది. ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని చెప్పే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని డిసిపి సూచించారు.

క్యాపిటల్ గూడ్స్ సూచీలు సానుకూలం

- ప్రభుదాస్ లిల్లాధర్ అంచనా

ముంబయి : ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా కాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసిజి, ఆటో, హెల్త్‌కేర్, ప్రయివేటు బ్యాంక్‌ల సూచీలు మంచి పనితీరును కనబరిచే అవకాశాలున్నాయనిఆర్థిక సేవల సంస్థ ప్రభుదాస్ లిల్లాధర్ పేర్కొంది. ఏ ప్రభుత్వమైనా క్యాపిటల్ గూడ్స్ సానుకూలంగా ట్రేడింగ్ కావొచ్చన్నారు. ఎన్‌డిఎ తిరిగి అధికారంలోకి వస్తే ప్రస్తుత విధానాల కొనసాగింపుతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిఫెన్స్, క్యాపిటల్ గూడ్స్, న్యూ ఎనర్జీ, టూరిజంకు సంబంధించిన సూచీలు పెరిగే అవకాశం ఉందన్నారు.